క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రోడ్లు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని 18వ వార్డులో ఆదివారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు రూ.40లక్షల నిధులతో రోడ్లు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కాలేజీరోడ్డులోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వద్ద డీఎంఎఫ్‌టీ నిధులు రూ.10లక్షలతో రోడ్డు నిర్మాణం, రైల్వే ట్రాక్ పక్కన రూ.30లక్షల మున్సిపల్ జనరల్ ఫండ్‌తో డ్రెయినేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్లు హఫీజా బేగం, పోరెడ్డి రాజు నాయకులు తాజ్, బొలిశెట్టి కిషన్, వంగపల్లి రవీందర్‌రావు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

మంచిర్యాలఅర్బన్: స్థానిక వివేకవర్ధిని డిగ్రీ కళాశాలలో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ 320జిల్లా యూత్ అవేర్నెస్, స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాలో 15కంపెనీలకు చెందిన హెచ్ఆర్‌లు పాల్గొనగా 500మంది అభ్యర్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ రాజిరెడ్డి, ఫాస్ట్ గవర్నర్ నారాయణరెడ్డి, మొదటి ఉపగవర్నర్ వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికోసమే ఎస్సీ వర్గీకరణ ప్రస్తావన



మాట్లాడుతున్న మధురాజ్

చెన్నూర్: రాజకీయ లబ్ధికోసమే కాంగ్రెస్ పార్టీ ఖమ్మం సభలో ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చేస్తామని ప్రకటించిందని ఎమ్మార్పీఎస్ (టీఎస్) జిల్లా ఇన్‌చార్జి తగరం మధురాజ్ అన్నారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మాదిగల ఓట్ల కోసం వర్గీకరణ ప్రస్తావన తీసుకొచ్చారని, ఎన్నికల తర్వాత పట్టించుకోరని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రావణ్, ప్రశాంత్, శ్రీధర్, శ్యాంసుందర్, శ్రీనివాస్, సతీశ్, నాగరాజు, లక్ష్మణ్, లచ్చన్న పాల్గొన్నారు.

'ముదిరాజ్‌లను విస్మరించిన బీఆర్ఎస్'



ర్యాలీ నిర్వహిస్తున్న ముదిరాజ్ కులస్తులు

చెన్నూర్: రాష్ట్రంలో ముదిరాజ్‌ల జనాభా 60లక్షలు ఉన్నప్పటికీ బీఆర్ఎస్ పార్టీ ఇటీవల ప్రకటించిన 115నియోజకవర్గాల అభ్యర్థులలో ఒక్క సీటు ముదిరాజ్‌లకు కేటాయించకుండా విస్మరించిందని ముదిరాజ్ కుల సంఘం నాయకులు గిరెల్లి మల్లయ్య అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆదివారం పట్టణంలోని పెద్ద చెరువు రావిచెట్టు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ముదిరాజ్‌లు కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడి కులస్తులను అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ యువకులు, కులస్తులు పాల్గొన్నారు.

కవితల పుస్తకావిష్కరణ



లక్సెట్టిపేట: మండలంలోని సాహితి స్రవంతి ఆధ్వర్యంలో దండేపల్లి మండలం వెల్గనూర్ గ్రామానికి చెందిన పాఠశాల విద్యార్థులు రచించిన 'మనఊరు-మన చెట్లు' అనే కవితల పుస్తకాన్ని ఆదివారం స్థానిక గుడ్ షెపర్డ్ పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు రచించిన కవితలను పుస్తకాల రూపంలో ప్రచురించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు రాజేశ్వరి, రవీంద్ర, రవీందర్, శ్రీనివాస్, జనార్దన్, మల్లేశం, రాజేశ్వర్ రావు, నీలాదేవి పాల్గొన్నారు.

పైపులైన్ పగిలినా.. పట్టించుకోరా..!



భీమారం: మండలకేంద్రంలోని ఆరెపల్లి క్రాస్‌రోడ్డు వద్ద మూడు నెలల క్రితం మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి నీరు రోడ్డుపై పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మరమ్మతు చేసేందుకు తీసిన గుంత అలాగే వదిలేయంతో, లీకైన చోట నుంచి కలుషిత నీరు చేరుతున్నాయి. గుంత నిండి రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కలుషితమవుతున్న నీటినే గ్రామంలో సరఫరా చేస్తుండగా, ఈ విషయంలో అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఒకవైపు స్వచ్ఛమైన నీటిని మిషన్ భగీరథ పేరుతో ప్రజలకు సరఫరా చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం, జాతీయరహదారిపై పగిలిన పైపులైన్ కనబడుతున్నా పట్టించుకోకపోవడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని పైపులైన్‌కు మరమ్మతు చేపించి, స్వచ్ఛమైన నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

కల్వర్టు నిర్మించారు.. అప్రోచ్ రోడ్డు మరిచారు

చెన్నూర్: పట్టణ పరిధిలోని అల్లూరి సీతారామ రాజు నగర్, కట్టకొమ్ము గుడిసెల కాలనీలో కాలువపై అధికారులు రెండు కల్వర్టులు నిర్మించారు. కల్వర్టులు నిర్మించి రెండు నెలలు అయినా, అప్రోచ్ రోడ్డు మాత్రం వేయలేదు. దీంతో కాలనీవాసుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. కల్వర్టు సైతం చాలా ఎత్తులో నిర్మించడం, వాటికి కనీసం ర్యాంపు కూడా సరిగ్గా లేకపోవడంతో వాటిపై నుంచి కనీసం నడవడానికి వీలు లేకుండా ఉంది. సంబంధిత అధికారులు ఎలాంటి ప్రణాళిక లేకుండా తమ ఇష్టారీతిన కల్వర్టుల ఎత్తు పెంచి నిర్మించారని కాలనీల వాసులు ఆరోపిస్తున్నారు. కాగా అప్రోచ్ రోడ్డు త్వరగా వేయాలని అడిగిన పలువురు బాధితులకు, మీరు మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా కాలువలను ఆక్రమించి, మీ ఇళ్ల ప్రహరీలను నిర్మించారని బాధితులకు మున్సిపల్ అధికారులు షోకాజ్ నోటీసులు పంపిస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కల్వర్టుల వద్ద అప్రోచ్ రోడ్డు వేయించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.



అల్లూరి సీతారామ రాజు నగర్‌లో...



కట్టకొమ్ము గుడిసెల కాలనీలో...

గీతకార్మికుల సభ్యత్వ నమోదు



గీతకార్మికులకు సభ్యత్వం అందజేస్తున్న ఎక్సైజ్ ఎస్సై జీవన్‌రెడ్డి, గౌడ సంఘం నాయకులు

జైపూర్: గీతకార్మికుల అభివృద్ధికై గీత పారిశ్రామిక సంఘంలో కొత్తవారికి సభ్యత్వం కల్పించి గుర్తింపు కార్డులు అందించడానికి గౌడ సంఘం పెద్దలతో చర్చించి తీర్మానం చేసినట్లుగా ఎక్సైజ్‌శాఖ ఎస్సై జీవన్‌రెడ్డి తెలిపారు. జైపూర్ మండలం ముదిగుంటలో ఆదివారం ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తవారిని సంఘంలో చేర్చుకోవడానికి పరీక్ష నిర్వహించారు. కుల వృత్తులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం జైపూర్ మండల అధ్యక్షుడు సేరెల్ల నరేశ్‌గౌడ్, జిల్లా శ్రీనివాస్ గౌడ్, మొగిలిపాక ప్రసూన్‌గౌడ్, గౌడ పెద్దలు తాళ్లపల్లి రామగౌడ్, బొల్లంపల్లి అంజయ్య గౌడ్, పాండురుగౌడ్, కిష్టగౌడ్ తదితరులు ఉన్నారు.

ఇంకెన్నాళ్లో ఎదురుచూపులు..!

- ఆరు నెలల క్రితం నూతన జీపీ భవనాలకు నిధులు మంజూరు
- ప్రారంభం కాని పనులు
- అద్దె, శిథిలావస్థ భవనాల్లో విధులు
- ప్రభుత్వ స్థలాలు లేక, స్థల సేకరణకు అవస్థలు



పాఠశాల భవనంలో కొనసాగుతున్న అంకతిపల్లి జీపీ కార్యాలయం

లక్సెట్టిపేట: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్నట్లుగా ఉన్నది గ్రామ పంచాయతీ కార్యాలయాల పక్కా భవన నిర్మాణ పనులు. ప్రభుత్వం మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలకు నూతన పక్కా భవనాలు మంజూరు చేసినా, పనులు ఇంకా ప్రారంభించలేదు. నిధులు మంజూరైనప్పటికీ స్థల సేకరణ, స్థలం ఇచ్చేందుకు దాతలు ముందుకు రాకపోవడంతో పనులు ఇంకా ప్రారంభించడం లేదు. ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో దాతల కోసం ఎదురుచూస్తున్నారు. పక్కా భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో విధులు కొనసాగిస్తున్నారు. వివిధ రకాల పనులతో అధికారులు పూర్తిస్థాయిలో విధులు నిర్వర్తించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలోపు పూర్తవుతాయని అనుకున్నా, భవనాలు ఇంకా ప్రారంభించకపోవడంతో ఇంకా ఎంత సమయం పడుతుందో అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. గ్రామసభలు గ్రామాభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి.

పనులు ప్రారంభిస్తాం

ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో కొన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించలేదు. కొన్ని జీపీ భవనాలకు స్థలం కేటాయించి భూమిపూజ నిర్వహించాం. కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లు ముందుకు రావడం లేదు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– నాగేశ్వర్ రెడ్డి, ఎంపీడీవో

నిర్మాణాలు జరగట్లే..

మండలంలో మొత్తం పద్దెనిమిది గ్రామ పంచాయతీలుండగా, అందులో ఆరు గ్రామ పంచాయతీ కార్యాలయాలకు నూతనంగా ఎన్నార్జీఎస్‌లో ఒక్కో జీపీకి ఇరవై లక్షల నిధులు విడుదల చేసి, పక్కా భవనాలను మంజూరు చేసింది. ఆరు నెలలు గడుస్తున్నా ఇంకా పనులు ప్రారంభం కాలేదు. మండలంలోని సూరారం, కొత్తూరు, జెండావెంకటాపూర్ అంకతిపల్లి, దొడపల్లి, హన్మంతుపల్లి గ్రామాలకు పక్కా భవనాలను మంజూరు చేశారు. కొత్తూరు గ్రామంలో భూమిపూజ చేసి నిర్మాణం పనులు చేపట్టారు. సూరారంలో ఇంకా ఎలాంటి పనులు ప్రారంభించలేదు. శిథిలావస్థలో ఉన్న భవనంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. అంకతిపల్లిలో ప్రభుత్వ భూమి లేకపోవడంతో, దాతకోసం ఎదురు చూస్తూ, పాత మూతబడిన పాఠశాల భవనంలో కొనసాగిస్తున్నారు. కొత్తూరులో పాత భవనంలో విధులు నిర్వర్తిస్తున్నారు. నూతన భవనానికి పక్కనే ప్రదేశంలో భూమిపూజ నిర్వహించారు. జెండా వెంకటాపూర్‌లో పాత భవనాన్ని కూలగొట్టి, అద్దె భవనంలో నెలకు వెయ్యి రూపాయలు చెల్లిస్తూ, కాలం వెల్లదీస్తున్నారు. దొడపల్లిలో పాత జీపీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. నూతన భవనానికి స్థలం లేకపోవడంతో రైతువేదిక భవనం ప్రదేశంలో నిర్మిద్దామంటే, కొంతమంది ఒప్పుకోవడం లేదని తెలుస్తుంది. హన్మంతుపల్లి గ్రామానికి ఐటీడీఏ నిధులు ఇరువై లక్షలు మంజూరు చేసినా, ఇంకా పనులు ప్రారంభించలేదు. పక్కాభవనం లేకపోవడంతో నెలకు రూ.1600 అద్దె చెల్లిస్తూ విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రామానికి చెందిన లింగయ్య అనే దాత స్థలాన్ని విరాళంగా ఇచ్చినప్పటికీ, కనీసం భూమిపూజ కూడా నిర్వహించలేదు. నిధులు మంజూరైనప్పటికీ పక్కా భవన నిర్మాణ పనులు ప్రారంభించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొంతమంది కాంట్రాక్టర్లు పనులు దక్కించుకుని కాలక్షేపం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని, గ్రామ పంచాయతీ నూతన భవనాల పనులను వెంటనే ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

నేరాల నియంత్రణకే 'కమ్యూనిటీ కాంటాక్ట్'



అవగాహన కల్పిస్తున్న సీఐ రాజేకుమార్

నెన్నెల: నేరాల నియంత్రణకే 'కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం' నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ రాజకుమార్‌గౌడ్ అన్నారు. రామగుండం సీపీ ఆదేశాల మేరకు నెన్నెల మండల కేంద్రంలో ఆదివారం నెన్నెల ఎస్సై శ్యాంపటేల్‌తో కలిసి కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు ఉన్నది ప్రజల రక్షణకేనని, ప్రజలకు పోలీసులు భద్రత, భరోసా కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చాలా మంది యువకులు ఆన్‌లైన్ మోసాలకు బలవుతున్నారని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని యువతకు అవగాహన కల్పించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, గ్రామాభివృద్ధికి పాటుపడాలని కోరారు. యువత చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని, వాట్సాప్ స్టేటస్‌లలో వివాదాస్పద మెసేజ్‌లు పోస్టు, ఫార్వర్డ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సరైన ధ్రువపత్రాలు లేని 45బైక్‌లు, నాలుగు ఆటోలను సీజ్ చేసి జరిమానా విధించారు. రాబోయే ఎన్నికల్లో ఎవరైనా అసాంఘిక శక్తులు అలజడి సృష్టించే అవకాశం ఉంటే, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై రవికుమార్, తాళ్లగురిజాల ఎస్సై నరేష్‌కుమార్, తాళ్లగురిజాల ఏఎస్సై రాజన్న, 20మంది పోలీసులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్

చెన్నూర్: పట్టణ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ పఠాన్ ఆదివారం పరిశీలించారు. ప్రత్యేక ఓటరు నమోదు సందర్భంగా ఈ నెల 26, 27తేదీల్లో, సెప్టెంబర్ 2, 3తేదీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు నమోదు, సవరణలు చేసుకునే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఓటరు లిస్టు ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా తయారు చేయాలన్నారు. బూత్ లెవల్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ మాంతయ్య, పలువురు సిబ్బంది, బూత్‌లెవల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్ ఆదివారం సందర్శించారు. ఓటరు నమోదు ప్రక్రియ ఎలా జరుగుతుందో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. బీఎల్‌ఓలు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

భీమిని: 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని బీఎల్‌ఓ సూపర్‌వైజర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిషన్ అన్నారు. కన్నెపల్లి మండలంలోని మెట్‌పల్లి, జన్కాపూర్, రెబ్బెన, కన్నెపల్లి, జజ్జరవెల్లి, ముత్తాపూర్, వీరాపూర్, టేకులపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. బీఎల్‌ఓలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు.

'మహిళల రక్షణ పోలీసుల బాధ్యత'



భీమారంలో ఎస్సై రాజవర్ధన్‌కు రాఖీ కడుతూ..



వేమనపల్లిలో రాఖీ కడుతున్న విద్యార్థిని



తాండూర్ : మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్



కాసిపేట: ఎస్సైకి రాఖీలు కడుతున్న విద్యార్థినులు

కాసిపేట/తాండూర్/భీమారం/వేమనపల్లి/బెల్లంపల్లి: పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం 'మీ భద్రత- మా బాధ్యత' కార్యక్రమం కొనసాగింది. తాండూర్‌లోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, కాసిపేటలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఎస్సై గంగారం ఆధ్వర్యంలో, భీమారం మండలంలోని పోలంపల్లి అనాథాశ్రమంలో ఎస్సై రాజవర్ధన్ ఆధ్వర్యంలో, వేమనపల్లిలో నీల్వాయి ఎస్సై సుబ్బారావు ఆధ్వర్యంలో,బెల్లంపల్లి బీసీ బాలికల గురుకుల వసతిగృహంలో బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్సై విక్టర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సైబర్‌మోసాలు, ఉమెన్ సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ, భద్రతకు పోలీస్‌శాఖ ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. మహిళల భద్రత- పోలీసుల బాధ్యత అని ఎటువంటి సమస్య ఉన్నా, సంబంధిత పోలీసుశాఖ నంబర్లకు ఫోన్ చేయాల్సిందిగా కోరారు. అనంతరం విద్యార్థులు పోలీస్ సిబ్బందికి రాఖీలు కట్టగా, మీకు మేము ఎల్లప్పుడు రక్షగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాసిపేటలో పాఠశాల ప్రత్యేకాధికారి సునీత, ఏఎస్సై రవీందర్, తాండూర్‌లో మాదారం ఎస్సై రాజశేఖర్, భీమారంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఈశ్రమ్' కు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న జాడి దేవరాజ్

పాతమంచిర్యాల: నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు ఈ శ్రమ్ లేబర్ ఇన్సూరెన్స్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డు కార్మికుల అడ్డాపై ఆదివారం నిర్మాణ రంగం కార్మికులతో సమావేశం నిర్వహించారు. నిర్మాణరంగ కార్మికులకు ఎలాంటి భద్రత లేదని, నిర్మాణ రంగాల్లో నిత్యం కార్మికులు ప్రమాదానికి గురై కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇన్సూరెన్స్ పథకాన్ని పొందితే భద్రత ఉంటుందన్నారు. ఐఎఫ్‌టీయూ సీనియర్ నాయకులు సూరయ్య, భూమయ్య, సురేష్, కార్మికులు పాల్గొన్నారు.

'హామీలు నెరవేర్చకుండా ఓట్లు అడుగొద్దు'

మందమర్రిరూరల్: గత ఎన్నికల్లో ప్రభుత్వ విప్ బాల్క సుమన్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ఓటు అడిగే నైతిక హక్కు లేదని వైఎస్సార్‌టీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు అజీమొద్దీన్ ఆరోపించారు. మందమర్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, ప్రజలకు ఎమ్మెల్యే అందుబాటులో ఉండటం లేదని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

'సుమన్‌కు ఓటమి భయం పట్టుకుంది'

మందమర్రిరూరల్: చెన్నూర్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌కు ఓటమి భయం పట్టుకొని, కాంగ్రెస్ వాళ్లంతా మనవాళ్లే అంటూ మతిభ్రమించి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని టీపీసీసీ మెంబర్ సూరకల రమేష్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఐఎన్‌టీయూసీ ఆఫీస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూర్ నియోజకవర్గంలో ఉన్నటువంటి ఖనిజ సంపదను దోచుకోవడానికే, వంద కేసులు ఉన్నాయంటూ నియోజకవర్గానికి వచ్చి నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి అభివృద్ధి పనులు చేయక మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్‌వాళ్లంతా మనవాళ్లే అంటూ సానుభూతి పొందడానికి మాట్లాడుతున్నాడని విమర్శించారు. సమావేశంలో పార్టీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, ముజాహిద్, ఉపేందర్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ప్రజాసమస్యలపై అఖిలపక్ష శ్రేణుల సమావేశం



మాట్లాడుతున్న కృష్ణ

బెల్లంపల్లి: అసెంబ్లీ నియోజకవర్గ సమస్యలపై రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు ఆదివారం చర్చించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి మున్సిపాలిటీ, అసెంబ్లీ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు వక్తలు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు సరిగ్గా అమలు జరగక, అర్హులైన లబ్ధిదారులకు మంజూరు కావడం లేదని తెలిపారు. ఈ నెల 29న మరోమారు ప్రత్యేక సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించుకోవాలని అఖిల పక్ష సమావేశం నిర్ణయించింది. సమావేశంలో అఖిల పక్ష నాయకులు సబ్బాని కృష్ణ, ఎండీ దాంద్‌పాషా, గోగర్ల శంకర్, మజీరాంసింగ్, మద్దెల శ్రీనివాస్, సాగర్, వెంకటేష్, ప్రశాంత్, శ్రీనివాస్, లక్ష్మి, హాసన్ పాల్గొన్నారు.

కూరగాయలు అమ్మి నిరసన



పాతమంచిర్యాల: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేపట్టిన రెండో ఏఎన్ఎంలు జిల్లా కేంద్రంలో కూరగాయలు అమ్ముతూ నిరసన తెలిపారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ కాంట్రాక్ట్ ఏఎన్ఎం జిల్లా అధ్యక్షురాలు పద్మ మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఏఎన్ఎంల యూనియన్ జిల్లా కార్యదర్శి మంజుల, ఏఎన్ఎంలు కవిత, రాజేశ్వరి, సంధ్య, మీనా, రజిత, సుజాత, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

కాసిపేట: హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభకు తరలివచ్చి విజయవంతం చేయాల్సిందిగా ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. దేవాపూర్‌లో ఆదివారం మండల కమిటీ సమావేశం నిర్వహించి మహాసభ విజయవంతంపై చర్చించారు.